
GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



# క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
## తెలంగాణ జిల్లాలు

గురువారం 17-09-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్


# తుక్కుగూడలో అక్రమ దందా బంద్

- అనుమతులు లేని వీణా క్లినిక్ కు తాళం! క్రైమ్ మిర్రర్ కథనానికి కదిలిన అధికార యంత్రాంగం!
- డాక్టర్ పట్టా లేకుండా అక్రమ సంపాదనికై. డాక్టర్ అవతారమెత్తిన వీణా...
- వీణా క్లినిక్ ను సీజ్ చేసిన జిల్లా వైద్య అధికారి స్వర్ణ కుమారి...
- అనుమలు లేకుండా హాస్పిటల్స్, డయాగ్నస్టిక్ సెంటర్లు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవు-డి ఎం హెచ్ ఓ




**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):**

మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో అనుమతులు లేకుండా గత కొన్ని సంవత్సరాలుగా అక్రమంగా నిర్వహిస్తున్న వీణా క్లినిక్ పై అధికారులు కొరడా ఝుళిపించారు.

**తుక్కుగూడలో నకిలీ డాక్టర్ల రాజ్యం- ప్రజల ప్రాణాలతో చెలగాటం**

క్రైమ్ మిర్రర్ లో వచ్చిన వార్తకు స్పందించిన రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. స్వర్ణ కుమారి తన బృందంతో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా నడుస్తున్నట్లు గుర్తించి వీణా క్లినిక్ ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ ఓ మాట్లాడుతూ.. జిల్లాలో అనుమతులు లేకుండా ఎవరైనా హాస్పిటల్స్, క్లినిక్స్, డయాగ్నస్టిక్ సెంటర్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ క్లినిక్స్ పై దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. క్రైమ్ మిర్రర్ ఎఫెక్ట్ తో అక్రమ క్లినిక్ కు చెక్ పడటంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.


తుక్కుగూడలో నకిలీ డాక్టర్ల రా
ప్రజల ప్రాణాలతో చెలగాటం..! అక్రమ సంపాదనికై....డాక్టర్ల అవతారం ఎత్తిన కేటుగా
చదివింది గోరంత....చేసే వైద్యం కొండంత..!
తుక్కుగూడలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ హాస్పిటల్స్
అర్హత లేదు,అనుమతి లేదు, అయినా రోగులకు ఇంజెక్షన్, గ్లూకోజ్ లు పెట్టడం....!
బి ఎ ఎం ఎస్,తో అల్లోపతి మాయ....సెలైన్ బాటిల్స్ తో ప్రాణాల బేరం..!
చిన్నపిల్లలు, పెద్దవాళ్లకు,ఎవరికైనా..వైద్యం చేస్తాం...వైద్యం వికటిస్తే.. చేతులెత్తేస్తం..!
నకిలీ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్...

# స్నేహితులే హంతకులు

**వ్యక్తిగత కక్షలతోనే హత్య రౌడీషీటర్ మర్డర్ కేసును ఛేదించిన పోలీసులు**

మన్సూరాబాద్, సెప్టెంబర్ 16: నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధి బండ్లగూడలోని ఓ వైన్స్‌లో జరిగిన రౌడీషీటర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. తల్లి, కుటుంబసభ్యులను అసభ్య పదజాలంతో దూషించడం, స్నేహితులని చూడకుండా తమతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆగ్రహం చెంది రౌడీషీటర్‌తో తిరిగే మిత్రులే వ్యక్తిగతంగా కక్ష పెంచుకొని పథకం ప్రకారం హత్య చేశారని పోలీసులు నిర్ధారించారు. ఎల్బీనగర్‌లోని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ సీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సుమతి కేసు వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,ఇల్లందుకు చెందిన మహ్మద్ నయీం (31) ప్రస్తుతం నాగోల్, బండ్లగూడ, రాజీవ్ స్వగృహ సముదాయాల్లోని సహభావన టౌన్‌షిప్‌లో నివాసముంటున్నాడు. ఓ మహిళతో సహజీవనం చేస్తూ.. వృత్తిరీత్యా కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నయీం పాత నేరస్తుడు.

మిగతా 2లో



# గ్రేటర్‌లో మళ్లీ ఉక్కపోత



ఇటీవల కురిసిన వర్షాలతో కాస్త చల్లబడిన నగరం.. మళ్లీ వేడెక్కోతోంది. నగరంలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలతో ఉక్కపోత అధికమవుతున్నది. కూలర్లు, ఏసీలు ఆన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది.ప్రపంచ పటాలు పరిశీలించండి బుధవారం నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34.0డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.0, గాలిలో తేమ 70 శాతంగా నమోదైందని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# స్నేహితులే హంతకులు

ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో 8 కేసులు, ఉప్పల్ పీఎస్‌లో 1 కేసు, వనస్థలిపురం పీఎస్‌లో 1 కేసు, హయత్‌నగర్ పీఎస్‌లో 1 కేసు నయీంపై ఉన్నా యి.ఇల్లందులో ఓమర్డర్ కేసులో నిందితుడైన నయీం పై రౌడీషీట్ ఉంది. ఇల్లందుకి చెందిన ఓట్ల దినకర్ (35), ఇల్లందు పట్టణానికే చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కనకం ఉమా మహేశ్ (32), మహ్మద్ నయీం ముగ్గురు చిన్ననాటి మిత్రులు. ఓట్ల దినకర్, కనకం ఉమామహేశ్‌కి క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. పాండిచ్చేరి, యానం, కొత్తపేటకి చెందిన సయ్యద్ రబ్బానీ (21) బాడీ బిల్డర్. ప్రస్తుతం నగరంలోని కూకట్‌పల్లిలో నివాసముంటూ జిమ్ ట్రైనర్‌గా పని చేస్తున్నాడు. చాంద్రాయణగుట్ట, ఉప్పుగూడ, శివసాయినగర్‌కి చెందిన ఒల్లిపోల్ల మహేశ్ (23) వృత్తిరీత్యా కూలీ పని చేస్తుంటాడు. సయ్యద్ రబ్బానీ, మహేశ్ మిత్రులు. 2024లో మాదాపూర్‌లో జరిగిన రియల్ ఎస్టేట్ ప్రమోషన్‌కి మహ్మద్ నయీం, ఓట్ల దినకర్, కనకం ఉమామహేశ్ వెళ్లారు. ప్రమోషన్స్‌కి బాడీ బిల్డర్‌గా వచ్చిన సయ్యద్ రబ్బానీ, మహ్మద్ నయీం గ్యాంగ్‌కి పరిచయమయ్యాడు. మహ్మద్ నయీం, ఓట్ల దినకర్, ఉమామహేష్, సయ్యద్ రబ్బానీ, ఒల్లిపోల్ల మహేశ్, చాంద్రాయణగుట్ట, పూల్‌బాగ్‌కి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ జబీ, కొత్తగూడెంకి చెందిన బోలె, ఖమ్మంకి చెందిన కార్తీక్ ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. ఉప్పల్ జరిగిన ఓ కేసులో 2025 జనవరిలో మహ్మద్ నయీం, దినకర్, ఉమామహేశ్, రబ్బానీ, మహేశ్, ఇస్మాయిల్ జబీ, బోలె, కార్తిక్ చర్లపల్లి జైలుకు వెళ్లినప్పుడు ఛత్రినాక, శివగంగనగర్‌కి చెందిన డెలివరీ బాయ్‌గా పని చేసే రాసమల్ల సాకేత్ (26) పరిచయం అయ్యాడు. రాసమల్ల సాకేత్ గ్యాంగ్‌లో జీహెచ్‌ఎంసీలో పనిచేసే తార్నాక, ఉస్మానియా యూనివర్సిటీ, మణిక్యనగర్‌కి చెందిన అలకుంట వెంకట్ (22), ఉప్పుగూడ, శివాజీనగర్‌కి చెందిన ఆటో డ్రైవర్‌గా పని చేసే కోడిగంటి రాఘవేందర్ అలియాస్ రఘు (27), ఛత్రినాక, కందిగల్ గేటుకి చెందిన వల్లపుదాసు చరణ్‌గౌడ్ (21), ఖమ్మం పట్టణానికి చెందిన మహ్మద్ బద్రుల్ల హుస్సేన్ అలియాస్ బద్రి (22) పని చేసే వారు. క్రిమనల్ బ్యాక్ గ్రౌండ్ ఎక్కువగా ఉన్న మహ్మద్ నయీం వీరిపై పెత్తనం చేస్తుండే వాడు. మహ్మద్ నయీం మద్యం తాగిన అనంతరం రబ్బానిని దూషించడంతో పాటు.. ఎక్కడో ఉండే రబ్బాని తల్లిని తిట్టేవాడు. దీంతో రబ్బానీ, నయీంకు దూరంగా ఉండాలని భావించాడు. దీంతో పాటు నయీంకి కనకం ఉమామహేశ్, దినకర్‌తో విభేదాలు ఏర్పడ్డాయి. మహ్మద్ నయీం అరాచకాలు రోజు రోజు పెరుగుతుండటంతో ఎలాగైనా అతడిని అంతమొందించాలని కనకం ఉమామహేశ్, దినకర్‌తో పాటు సయ్యద్ రబ్బానీ పథకం వేసుకున్నారు. రబ్బాని తన మాజీ జైలు సహచరుడు రాసమల్ల సాకేత్ సహాయం కోరాడు. 2024-25లో జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న సమయంలో నయీం తనను వేధించాడనే కారణంతో సాకేత్ కూడా కక్ష పెంచుకుని ఉన్నాడు. నయీం హత్య పథకంలో సాకేత్‌తో పాటు అతడి అనుచరులు పాలు పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 14న నాగోల్, బండ్లగూడలోని సుప్రీం వైన్స్ వద్దకు చేరుకున్నారు. వైన్ దుకాణం లోపలికి వెళ్తూనే ఇద్దరు మహ్మద్ నయీం కళ్లల్లో కారం చల్లగా.. మరి కొందరు తమ వెంట తెచ్చుకున్న వేట కొడవలి, సుత్తితో దాడి చేశారు. మరి కొందరు కడాయి తీసుకుని నయీం తలపై, ఛాతిపై మోదారు. దీంతో నయీం అక్కడికక్కడే మృతి చెందాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు..వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. నయీంను హత్య చేసిన అనంతరం ఛత్రినాకలో తలదాచుకున్న సయ్యద్ రబ్బానీ, ఒట్ల దినకర్, ఒల్లిపోల్ల మహేశ్, రాసమల్ల సాకేత్, అలకుంట వెంకట్, కొడిగంటి రాఘవేందర్, వల్లపుదాసు చరణ్‌గౌడ్, మహ్మద్ బద్రుల్ల హుస్సేన్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. నయీం తమపై చేస్తున్న ఆరాచకాలు, కుటుంబసభ్యులపై చేస్తున్న దూషణల కారణంగానే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో నిందితులు తెలిపారు. పరారీలో నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# ఆర్టీఏలో ఆడిందే ఆట.. పాడిందే పాట

ఆర్టీఏలో కొందరు ఏఓలు ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదు. ఆర్టీఓలపై ఓ ఉద్యోగ సంఘంలో తమది కీలక రోల్ అంటూ ఒత్తిడి తీసుకొచ్చి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఇతర జిల్లా నుంచి హైదరాబాద్‌లోని ఓ జోన్‌కు బదిలీ అయిన ఓ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫైళ్లను క్లియర్ చేయడంలో కీలకపాత్ర వహిస్తున్నారు. ఆయన పరిధిలో అయ్యే ప్రతీ పనికి ఓ ధర నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అ కార్యాలయ ఆర్టీఓ అలా చేయొద్దని వాదించినా వినిపించుకోకుండా సంఘం ముసుగులో బెదిరింపులకు పాల్పడటం ఆ కార్యాలయంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అదే కార్యాలయంలో పలు అక్రమాలపై గతంలో పోలీస్ కేసులు నమోదయ్యాయి. కొన్ని వాహనాలకు సంబంధించిన యజమానులు మరణిస్తే వాటిని పరిశీలించకుండానే అమ్యామ్యాలతో వాహన యాజమాన్య హక్కులు మార్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆ విషయంపై సదరు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఏఓ.. ఏ కార్యాలయంలో విధులు నిర్వర్తించినా వాహనదారులకు సంబంధించిన ఫైళ్లను కాసులతోనే లెక్కిస్తాడని సిబ్బంది సైతం చర్చించుకుంటున్నారు. ఏడాదిలో అనేక సార్లు టూర్లు, విదేశీ ట్రిప్పుల పేరుతో సెలవుల్లో ఉంటూ వచ్చాక తాను నియమించుకున్న ప్రైవేటు సిబ్బందిని ఇన్ని రోజుల కలెక్షన్స్ ఏవని ఒత్తిడి తెస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఆర్టీఏ కార్యాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పాత్ర చాలా కీలకమైనది. కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయి పరిశీలనలు, డ్రైవింగ్ పరీక్షలు చుసుకుంటే, కార్యాలయ అంతర్గత పరిపాలన, ఫైళ్ల నిర్వహణ, సిబ్బంది పర్యవేక్షణ అంతా ఏఓ పరిధిలోనే ఉంటుం ది. ఏ సెక్షన్‌లో ఏ ఫైల్ ఆగిపోయింది? ఏ అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి? వాటిని ఆయనే పరిశీలిస్తారు. వాహన రిజిస్ట్రేషన్లు, లైసెన్సుల జారీ, పర్మిట్లు వంటి విభాగానికి సంబంధించిన రికార్డులను భద్రపరచడం వంటి కార్యకలాపాలకు ఏఓ అధికారులే జవాబుదారిగా ఉండాల్సి ఉంటుంది. వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజులు, లైఫ్‌టాక్స్, చలానాలు ఇతర జరిమానాల రూపంలో వచ్చే ప్రభుత్వ ఆదాయాన్ని, లెక్కలను ఏఓనే పర్యవేక్షిస్తారు. రోజువారీ వసూలైన నగదు సక్రమంగా ప్రభుత్వ ఖాతాకు జమ అవుతుందో లేదో అకౌంట్స్ విభాగంతో ఆయన పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ మొత్తం అంశాలన్నింటినీ ఆర్టీఓలకు నివేదికలు ఇవ్వాల్సి ఉంటుం ది. కార్యాలయాలకు సంబంధించిన ప్రగతి నివేదికలు, కోర్టు కేసుల వివరాలు, ప్రభుత్వానికి పంపాల్సిన నివేదికను సమయానికి ఆర్టీఓ ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన బాధ్యతల్లో ఉన్న ఆ అధికారులు ఆర్టీఓలను సైతం పక్కదారి పట్టిస్తూ తమ చేతివాటం చూపిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సీసీలు, ఎన్‌ఓసీలు జారీ చేయడం, వాటిని రద్దు చేయడంలో వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆర్‌సీలు లేని వాహనాలను ఇతర వ్యక్తుల పేర్లపైకి మార్చడంలో వేలాది రూపాయలు దండుకుంటున్నారు. రెండేండ్ల కిందట ఓ వాహనదారుడు సదరు కార్యాలయం నుంచి ఇతర రాష్ట్రానికి తీసుకున్న ఎన్‌ఓసీని ఇటీవల వెనక్కి తీసుకొచ్చాడు. అయితే ఆ ఎన్‌ఓసీని క్లియర్ చేయడం కోసం ప్రభుత్వం రుసుంతో పాటు అదనంగా డబ్బులు ముట్టజెబితేనే ఎన్‌ఓసీ క్లియర్ చేసినట్టు బాధితుడు వివరించాడు.



## వాడపల్లిలో నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, సెప్టెంబరు 16:** దామరచర్ల మండలం వాడపల్లి వద్ద కృష్ణానదిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మిర్యాలగూడ ఆర్డీవో ఎస్. రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. కృష్ణానదిపై వాడపల్లి వంతెన వద్ద మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.నిమజ్జన ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు.ఆర్డీవో వెంట దామరచర్ల తహసీల్దార్ జవహర్‌లాల్ నాయక్, ఆర్‌అండ్‌బీ, మండల పంచాయతీ అధికారి, పోలీసు అధికారులు ఉన్నారు.

## సింగరేణి కార్మికుడి బలవన్మరణం

**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 16 ( క్రైమ్ మిర్రర్) :** ఆర్కేపీ సీహెచ్‌పీ లో జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సింగరేణి కార్మికుడు కళ్యాణి జోగేశ్వర్ (58) బుధవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నారు. స్థానిక శివాజీనగర్‌కు చెందిన ఆయన, ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు.బుధవారం సాయంత్రం జోగేశ్వర్ భార్య నిత్యావసర సరుకుల కోసం బయట ఉన్న కిరాణా షాపునకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి భర్త ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారు. భర్త ఉరి వేసుకున్నాడని తెలిసిన వెంటనే భార్య తీవ్ర దిగ్భ్రాంతికి గురై స్పృహ తప్పి పడిపోయారు. గమనించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం వెంటనే స్థానిక సింగరేణి ఆసుపత్రికి తరలించారు. అనంతరం స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.ఆత్మహత్యకు దారితీసిన స్పష్టమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా, మృతుడి తండ్రి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జోగేశ్వర్ కూడా ఇటీవలే ఉద్యోగానికి సంబంధించి 'మెడికల్ అన్‌ఫిట్' కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనపై స్థానిక ఎస్సై జాడి శ్రీధర్ విచారణ జరుపుతున్నారు.



## నకిలీ ఎల్ ఆర్ ఎస్ పత్రాలతో నిర్మాణ అనుమతి..

**కేసు నమోదు...**

**మాదాపూర్:** గుట్టల బేగంపేట్‌లోని సర్వే నంబర్ 32, ప్లాట్ నంబర్ 55కు సంబంధించి నకిలీ ఎల్ ఆర్ ఎస్ పత్రాలతో భవన నిర్మాణ అనుమతి పొందినట్లు వచ్చిన ఫిర్యాదుపై మున్సిపల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఎస్ ఐ. సురేష్ కుమార్ ఫిర్యాదు వివరాల ప్రకారం.. సదరు ప్లాట్‌కు ఫిర్యాదుదారుడి సోదరుడు అసలు యజమానిగా ఉండగా, షేక్ మస్తాన్ అనే వ్యక్తి ఇతరుల ఎల్ ఆర్ ఎస్ పత్రాలను ఉపయోగించి, యుఎల్సీ క్లియరెన్స్ లేకుండా కేవలం అక్నాలెడ్జ్‌మెంట్ ఆధారంగా టీ జీ -పాస్ ద్వారా నిర్మాణ అనుమతి పొందినట్లు అధికారులు గుర్తించారు. దీంతో మున్సిపల్ అధికారులు ఆ అనుమతిని రద్దు చేశారు.అయితే అనుమతి రద్దు చేసినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో, సర్కిల్-50 డిప్యూటీ కమిషనర్ ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## నీటి కాలుష్యాన్ని పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మట్టి గణేష్ లను పూజించాలి

**గత 28 సంవత్సరాల నుండి వినాయక విగ్రహాన్ని పెట్టి పూజిస్తున్నాం**

**పిఎన్ఆర్ కమిటీ అధ్యక్షుడు పొన్నాల నాగరాజు**



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 16 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి ఆస్బెస్టాస్ కాలనీ పిఎన్ఆర్ గల్లి కా గణేష్ కమిటీ లో గత 28 ఏళ్ల నుండి 5 కుటుంబాలు కలిసి వినాయక విగ్రహన్ని పెట్టి పూజిస్తున్నామని పిఎన్ఆర్ కమిటీ అధ్యక్షుడు పొన్నాల నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా పొన్నాల నాగరాజు మాట్లాడుతూ "మట్టి గణపతినే పూజిద్దాం...రంగు విగ్రహాలాని మనేద్దం..మట్టి విగ్రహం ప్రకృతికి మేలు అని అన్నారు. నీటి కాలుష్యానికి అడ్డుకట్ట వేయడం అనేది మన పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని, జీవవైవిధ్యాన్ని కాపాడటానికి అత్యంత కీలకమైన అంశం అని, మన సంప్రదాయం మన బాధ్యత అని అన్నారు. కాలనీ వాళ్ళంతా కలిసికట్టుగా కమిటి ఒక షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజూ నిత్య పూజలు జరుపుకోవడం చాలా గొప్ప విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుధీర్, ఠాకూర్, సోని, మనోహర్, మనస, గోలి అర్జున్ రావు, సీత, శ్రీనివాస్, కమిటి అద్యక్షుడు సామాజిక కార్యకర్త పొన్నాల నాగరాజు, సంధ్య పాలుగొన్నారు.

# కేసీఆర్ పాలనలోనే గిరిజనులకు స్వర్ణయుగం

**తండాలకు ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేసి స్వయం పాలనకు బాటలు.. శక్రు నాయక్**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ):** తెలంగాణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే గిరిజనులకు స్వర్ణయుగం నడిచిందని మరి గుంత తండా బీఆర్ఎస్ ఎస్టీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్లావత్ శక్రు నాయక్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తండాలు ఆయా గ్రామపంచాయతీల పరిధిలో ఉండేవని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు స్వయం పాలనకు అవకాశం కల్పించారని శక్రు నాయక్ తెలిపారు. దీంతో తండాల అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి మరింత అవకాశం ఏర్పడిందన్నారు. గిరిజన విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం గిరిజన విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. గిరిజన రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేసి వ్యవసాయ రంగానికి అండగా నిలిచారని అన్నారు. గిరిజనులకు ఉన్న ఆరు శాతం రిజర్వేషన్లను పది శాతానికి పెంచుతూ కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని శక్రు నాయక్ గుర్తుచేశారు. పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ గిరిజన రైతులకు పట్టాలు అందించిన ఘనత కూడా కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిందని శక్రు నాయక్ విమర్శించారు. గతంలో అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను నిలిపివేశారని ఆరోపించారు. గిరిజనుల కోసం కేసీఆర్ చేసిన సేవలను ఆ సమాజం ఎప్పటికీ మరిచిపోదని అన్నారు. కేసీఆర్ సేవలను స్మరించుకుంటూ గురువారం రాష్ట్రంలోని ప్రతి తండాలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, ఆయన చేసిన సేవలను కొనియాడాలని గిరిజనులకు శక్రు నాయక్ పిలుపునిచ్చారు.

# మణికొండలో గణేష్ మండపం వద్ద మహా ప్రసాదం

**- భక్తులకు ప్రసాదం పంపిణీ చేసిన నవజ్యోతి యువజన సంఘం**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండలోని నవజ్యోతి యువజన సంఘం ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద భక్తులకు మహా ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. గణనాథుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు సంఘం సభ్యులు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నవజ్యోతి యువజన సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులకు సేవలందించడంలో భాగంగా మహా ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది.

# ఆరవ వసంతంలోకి అడుగుపెట్టిన చౌటుప్పల్ కోర్టు

**- న్యాయ సేవలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చౌటుప్పల్ కోర్టు**

**చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి**

**- ఐదు సంవత్సరాల మైలురాయి చేరుకున్న చౌటుప్పల్ కోర్టు**



**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:**చౌటుప్పల్ కోర్టు నేటితో ఐదు సంవత్సరాల న్యాయ సేవలను పూర్తిచేసుకుని ఆరవ పడిలోకి అడుగుపెట్టడం సంతోషంగా ఉందని చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామన్నపేటలో కోర్టు ఉండటంతో, చౌటుప్పల్ నుంచి వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలు కోర్టు కేసులకు వెళ్లేవారన్నారు. చిన్నచిన్న కేసుల్లో సైతం చౌటుప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలు రామన్నపేట కోర్టుకు వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి వచ్చే వారని గుర్తు చేశారు. జాతీయ రహదారి వెంట, పరిసర మండలాల ప్రజలకు అనువైనదిగా ఉన్న చౌటుప్పల్ లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదన, 2021సెప్టెంబర్ 16వ తేదీన చౌటుప్పల్ లో కోర్టు ఏర్పాటు అయిందన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న చౌటుప్పల్ మండల కేంద్రంలో చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు 2021లో ప్రారంభమై, నేటికి విజయవంతంగా ఐదు సంవత్సరాల న్యాయ సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ ఐదేళ్ల కాలంలో స్థానిక ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, సులభతరమైన న్యాయ సేవలను అందించడంలో ఈ కోర్టు కీలక పాత్ర పోషించింది. 2021లో ఏర్పాటైన నాటి నుంచి చౌటుప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలకు సుదీర్ఘ దూరాలు ప్రయాణించాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే న్యాయం చేకూరుతోందన్నారు. గత ఐదేళ్లలో ఎన్నో సివిల్ మరియు క్రిమినల్ కేసులను చట్టపరంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం జరిగిందన్నారు. కోర్టు పరిధిలో చట్టాలపై ప్రజలకు, మహిళలకు, యువతకు అవగాహన కల్పించేందుకు పలు ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సులు విజయవంతంగా నిర్వహించ బడ్డాయన్నారు. రాజీపడదగ్గ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి, కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించడంలో ఈ న్యాయస్థానం ఎంతో కృషి చేసిందన్నారు. ఈ ఐదేళ్ల విజయవంతమైన ప్రస్థానానికి సహకరించిన న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, లాయర్లు, పోలీస్ శాఖ, స్థానిక ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లోనూ ఇదే విధమైన పారదర్శకతతో, మరింత వేగంగా ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు కోర్టు నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

# పత్తికుంటలో ఘనంగా గణేష్ నిమజ్జనం

**- భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ స్వాగతం పలికిన నిర్వాహకులు**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్‌లోని పత్తి కుంట హనుమాన్ సాగర్‌లో మూడో రోజు గణేష్ నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన గణేష్ భక్తులకు నిర్వాహకులు, జీహెచ్ఎంసీ సిబ్బంది సకల సౌకర్యాలు కల్పిస్తూ స్వాగతం పలికారు. గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై. శ్రీధర్, జాయింట్ కన్వీనర్ వేణుగోపాల్, రాజేందర్, సురేందర్ రెడ్డి తదితరులు భక్తులకు స్వాగతం పలికారు. జీహెచ్ఎంసీ సిబ్బంది కూడా నిమజ్జన ప్రదేశంలో భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారీగా తరలివచ్చిన భక్తులు గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో సహకరిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది, నిర్వాహకులకు గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# బండ్లగూడ జాగీర్‌లో రూ.1.5 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి కసరత్తు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బండ్లగూడ జాగీర్‌లోని శివాజీ యూత్ భవనం నుంచి కాళీమందిర్ మెయిన్‌రోడ్ వరకు సుమారు రూ.1.5 కోట్ల నిధులతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారిని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఈ పనులకు చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ సహకారంతో ప్రతిపాదించిన ఈ రహదారి అభివృద్ధి పనులను మాజీ మేయర్ మహేందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ అధికారులతో కలిసి పరిశీలించారు. రహదారి పరిస్థితి, నిర్మాణానికి అవసరమైన పనులు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను అధికారులు పరిశీలించారు. శివాజీ యూత్ భవనం నుంచి కాళీమందిర్ మెయిన్‌రోడ్ వరకు రహదారి అభివృద్ధి పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ప్రస్తుతం రహదారి పరిస్థితుల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులకు పరిష్కారం లభించనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. రహదారి నిర్మాణంతో పరిసర కాలనీలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా , సూపరింటెండింగ్ ఇంజనీర్ నరేందర్ గౌడ్, డిప్యూటీ ఇంజనీర్ యాదయ్య, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. రహదారి నిర్మాణానికి సంబంధించిన అంశాలపై అధికారులు చర్చించారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని మాజీ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సహకారంతో నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

# శివరాంపల్లి శ్యామలనగర్‌లో ఘనంగా గణనాథుడి పూజలు

**- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ అర్చన జైప్రకాశ్**


**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శ్యామలనగర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద గణనాథుడికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ అర్చన జైప్రకాశ్ పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానికులు, నిర్వాహకులతో కలిసి గణేష్ ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానికులు, భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నార్సింగి సర్కిల్ మున్సిపల్ కార్యాలయం తరలింపుపై బీఆర్ఎస్ అభ్యంతరం

**- నార్సింగిలోనే కొనసాగించాలని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగిలో ప్రస్తుతం కొనసాగుతున్న నార్సింగి సర్కిల్ మున్సిపల్ కార్యాలయాన్ని మణికొండకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నార్సింగి సర్కిల్ అధ్యక్షుడు కే. విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా మున్సిపల్ కార్యాలయాన్ని నార్సింగిలోనే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయాన్ని మణికొండకు తరలిస్తే నార్సింగి పరిధిలోని జొన్నవాడ, మిర్జాగూడ, గండిపేట్, నాగులపల్లి, ఖానాపూర్, కోకాపేట్ తదితర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం నార్సింగిలో కార్యాలయం ఉండటం వల్ల ఆయా ప్రాంతాల ప్రజలకు సేవలు సులభంగా అందుతున్నాయని తెలిపారు. కార్యాలయాన్ని మణికొండకు తరలిస్తే దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు అదనపు ప్రయాణ భారం, సమయం వృథా అవుతుందని ఆయన అన్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని కార్యాలయం తరలింపు ప్రతిపాదనను అధికారులు పునరాలోచించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయం తరలింపు ప్రక్రియ కొనసాగితే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహిస్తామని విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న నార్సింగిలోనే మున్సిపల్ కార్యాలయాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.



# ముస్కీపేట వినాయకుడిని దర్శించుకున్న కర్క నాగరాజు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 16 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గం, కైత్లాపూర్ డివిజన్‌లోని ముస్కీపేటలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గం ఐఎన్టీయూసీ అధ్యక్షుడు కర్క నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో కర్క నాగరాజును ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అర్జున్, ఎల్లేష్, మల్లేష్, లీడర్ బాబు, కర్క లోహిత్ రాజ్, కార్తీక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

**వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, కంచి మహేందర్**

**బాలానగర్, సెప్టెంబర్ 16 (క్రైమ్ మిర్రర్) :** సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ / మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, కంచి మహేందర్ పాల్గొని, తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు అందించేందుకు బీజేపీ ప్రతిపాదించిన “తెలంగాణ సప్త సంకల్పాలు” అమలు చేయాలని కోరారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడంతో పాటు, సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్మారక చిహ్నం, హైదరాబాద్--తెలంగాణ విమోచన మ్యూజియం, జిల్లా స్థాయిలో స్మృతి కేంద్రాలు, పాఠ్యపుస్తకాల్లో విమోచన చరిత్ర, చారిత్రక ప్రాంతాల్లో స్మారక స్తూపాలు, తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. విమోచన పోరాటంలో అమరవీరుల త్యాగాలను గౌరవిస్తూ, తెలంగాణ విమోచన చరిత్రను శాశ్వతంగా పరిరక్షించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్, బాలానగర్, మూసాపేట, అల్లాపూర్ ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కిరణ్ కుమార్ సంగం

**- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా కిరణ్ కుమార్ సంగం నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి బుధవారం కిరణ్ కుమార్ సంగంకి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కిరణ్ కుమార్ సంగంకి సూచించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, కాంగ్రెస్ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన కిరణ్ కుమార్ సంగం మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మార్గదర్శకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెక్నాంపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్, మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, సీనియర్ నాయకులు మహేష్ రెడ్డి తదితరులు పాల్గొని నూతనంగా నియమితులైన కిరణ్ కుమార్ సంగం గారికి అభినందనలు తెలిపారు.

# ఆర్టీసీ కార్మికులపై పెంచిన పనిభారాలు తగ్గించాలి



**- రాజేంద్రనగర్ బస్ డిపో ఎదుట స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ధర్నా**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆర్టీసీ కార్మికులపై పెంచిన పనిభారాలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ టీ.జీ.ఎస్.ఆర్.టి.సీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం రాజేంద్రనగర్ బస్ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. డిపో కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డిపో కార్యదర్శి కే. మధు అధ్యక్షత వహించగా, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ హైదరాబాద్ రీజియన్ కార్యదర్శి ఎస్. కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్. కృష్ణ, కే. మధు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులపై పెంచిన పనిభారాలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నడుస్తున్న అన్ని సర్వీసు రూట్లను శాస్త్రీయంగా సర్వే చేసి, ప్రతి రూట్‌కు సరైన రన్నింగ్ టైమ్ కేటాయించాలని కోరారు. పెంచిన పనిభారాల తగ్గింపు లక్ష్యంగా డిపో, రీజియన్ స్థాయిలోని కార్మిక సంఘాలతో చర్చించిన తర్వాతే సర్వీసుల్లో మార్పులు చేస్తామని ఈడీ కమిటీ చర్చల్లో యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. అయితే, ఆచరణలో ఇందుకు భిన్నంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. కార్మిక సంఘాలతో చర్చలు, సంప్రదింపులు లేకుండానే అనేక డ్యూటీల్లో మార్పులు చేస్తూ కార్మికులపై అదనపు పనిభారం మోపుతున్నారని అన్నారు. ఈడీ కమిటీ అంగీకరించిన అంశాలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో తక్షణమే ఎన్నికలు నిర్వహించి విలీన ప్రక్రియను ప్రారంభించాలని వారు కోరారు. అనంతరం కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేశారు. ధర్నా అనంతరం రాజేంద్రనగర్ డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కమిటీ కార్యదర్శి కే. మధు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. మధు మాట్లాడుతూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భావం నుంచి ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల హక్కుల సంరక్షణ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఐక్య పోరాటాల పునాదులపై ఏర్పడిన సంఘంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్మికులను నిరంతరం చైతన్యపరుస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ రెగ్యులేషన్స్‌లో మార్పులు చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘం పోరాడుతోందన్నారు. సమ్మె సమయంలో అంగీకరించిన అంశాల ప్రకారం నష్టం లేని విలీనం, ఉద్యోగ భద్రత, పనిభారాల తగ్గింపు, కార్మిక సంఘాలకు పూర్తిస్థాయి గుర్తింపు వంటి డిమాండ్ల సాధన కోసం కార్మికులు, కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక ఉద్యమాన్ని పరిరక్షించుకోవాలని 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిపో నాయకులు ఎం. సూర్య నాయక్, జనార్దన్, లాలు, శ్రీనివాస్, మోహన్‌తో పాటు పలువురు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.







# ఎడిట్ చేసిన కాపీ ఇది అన్నా, నేరుగా వాడుకోవచ్చు:

**సైబరాబాద్‌లో నిమజ్జన ఏర్పాట్లపై పోలీస్, మున్సిపల్ ఉన్నతాధికారుల క్షేత్ర పరిశీలన...**

**క్రైమ్ మిర్రర్ సైబరాబాద్ :** వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం సైబరాబాద్ పోలీస్, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన అనంతరం, సీపీ రమేష్, సీఎంసీ కమిషనర్ జి. సృజనతో కలిసి కమిషనరేట్ పరిధిలోని ఐడీపీఎల్, సూరారం తదితర నిమజ్జన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్లు, విద్యుత్ దీపాలు, గజ ఈతగాళ్ల ఏర్పాటు తదితర అంశాల్లో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీగా తరలివచ్చే భక్తులు, వాహనాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ మార్గాలు, అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీలు కోటి రెడ్డి, రీతిరాజ్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిణి రెడ్డి, ఎస్బీ డీసీపీ సువేంద్ర, అదనపు డీసీపీలు, ఏసీపీలు, విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ, దేవాదాయ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మణికొండ జడ్పీహెచ్ఎస్‌లో మాదిరి ఎన్నికలు

**- పాఠశాల లీడర్లుగా గొల్ల పవిత్ర, గొల్ల చందు విజయం**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి మాదిరి ఎన్నికలను నిర్వహించారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కుపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం 911 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల్లో 14 మంది విద్యార్థులు పోటీ చేయగా, వారిలో 6 మంది అబ్బాయిలు, 8 మంది అమ్మాయిలు ఉన్నారు. అమ్మాయిల విభాగంలో గొల్ల పవిత్ర 339 ఓట్లతో, అబ్బాయిల విభాగంలో గొల్ల చందు 336 ఓట్లతో విజయం సాధించి 2026-27 విద్యా సంవత్సరానికి పాఠశాల లీడర్లుగా ఎన్నికయ్యారు. ఈ మాదిరి ఎన్నికల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ద్వారా విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతతో పాటు ప్రజా ప్రతినిధుల ఎన్నిక విధానంపై అవగాహన కల్పించారు. సామాజిక శాస్త్ర ఉపాధ్యాయులు వరలక్ష్మి, విజయ్‌కుమార్, కిషన్, సత్తయ్య పాఠశాల బృందం సహకారంతో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, పాఠశాల బృందం, ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి, వెంకటప్ప, శివరాం, మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, మణికొండ డివిజన్ అధ్యక్షులు శ్రీరాములు, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, శివగంగ తదితరులు పాల్గొన్నారు.



# అనధికార నిర్మాణాలపై సీఎంసీ ఉక్కుపాదం

క్రైమ్ మిర్రర్ సైబరాబాద్: సైబరాబాద్ పరిధిలో అనధికార నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ముమ్మరం చేసింది.ఇందులో భాగంగా మంగళవారం మూడు జోన్ల పరిధిలో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టిన సీఎంసీ బృందాలు 18 అనధికార నిర్మాణాలను గుర్తించాయి. అందులో 17 నిర్మాణాలను కూల్చివేసి, మరో 6 నిర్మాణాలకు నోటీసులు జారీ చేశాయి.

**జోన్ ల వారీగా కూల్చివేతల వివరాలు:**

శేరిలింగంపల్లి జోన్ – 6
కూకట్‌పల్లి జోన్ – 4
కుత్బుల్లాపూర్ జోన్ – 7

అనధికార నిర్మాణాలపై నిరంతరం నిఘా ఉంచి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సీఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. మూడు జోన్ల పరిధిలో తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

**అమరవీరులకు నివాళులు అర్పించి సీపీఐ జెండా ఆవిష్కరణ**

గండిపేట(క్రైమ్ మిర్రర్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ శంషాబాద్ మండల కార్యదర్శి నర్ర గిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు రాచమల్ల యాదగిరి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచమల్ల యాదగిరి, నర్ర గిరి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వేలాది మంది చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. రైతులు, పేదలు, ప్రజల సమస్యల కోసం పోరాడిన చాకలి ఐలమ్మ వంటి వీరవనితల స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. చాకలి ఐలమ్మ రైతుల సమస్యలపై ధైర్యంగా పోరాడారని, ఆమె పోరాటానికి కమ్యూనిస్టు నాయకులు అండగా నిలిచారని వారు పేర్కొన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక మంది కమ్యూనిస్టు యోధులు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులు, మహిళల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలని రాచమల్ల యాదగిరి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఉదయం 11 గంటలకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ సీపీఐ మండల నాయకులు గిలకరాజు, శ్రీనివాస్, దండి రవికుమార్, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# వేగం కంటే ప్రాణం విలువైనది

**ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం, ప్రమాదాలను నివారిద్దాం**

**ఎస్ ఐ కె లింగారెడ్డి**



క్రైమ్ మిర్రర్, నాంపల్లి: అలీవ్ అరివ్ ప్రోగ్రామ్ లో భాగంగా జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు డి టీ ఆర్ బి బృందం వారిచే ఎస్ ఐ లింగారెడ్డి ఆధ్వర్యంలో నాంపల్లి మండల కేంద్రంలో రోడ్డు రోడ్డు భద్రత గురించి మీటింగు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డి టీ ఆర్ బి బృందం "రోడ్డు భద్రత పై పలు ముఖ్యమైన సూచనలు ఇవ్వడం జరిగింది. అనంతరం స్థానిక ఎస్ ఐ మాట్లాడుతూ మనం ఇంటి నుండి ఎంత భద్రతతో వస్తున్నామో అంతే క్షేమంగా ఇంటికి చేరాలని అందరి ఉద్దేశం, మండలం అన్ని గ్రామాలలోని సీసీ కెమెరాలు లేవు, ఇటీవల తుంగపాడులో గ్రామ సర్పంచ్, ఆ గ్రామ పెద్దలు కలిసి కొన్ని సి సి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అదే విధంగా అన్ని గ్రామాలలోని కూడలల్లో గ్రామ సర్పంచ్, పెద్దల సహకారంతో సి సి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ పెట్టుకోవాలని, కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించాలని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలు, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, ప్రమాదకరమైన ఓవర్‌టేకింగ్‌కు దూరంగా ఉండాలని, మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనం నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో రోడ్డుపై పూర్తి దృష్టి పెట్టాలి. పాదచారులు జీబ్రా క్రాసింగ్, నిర్దేశిత మార్గాల్లోనే రోడ్డు దాటాలి. రాత్రివేళ వాహనం నడిపేటప్పుడు హెడ్‌లైట్లు సక్రమంగా పనిచేస్తున్నాయో ముందుగా చూసుకోవాలని, వాహనం బ్రేకులు, టైర్లు, లైట్లు, ఇండికేటర్లు తదితరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని, బస్సులు, లారీల వంటి భారీ వాహనాల దగ్గర సురక్షిత దూరం పాటించాలి. చిన్న పిల్లలను వాహనాల్లో ప్రయాణింపజేసేటప్పుడు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలి, ముందున్న వాహనానికి తగినంత సురక్షిత దూరం పాటించాలని, వర్షం, పొగమంచు వంటి పరిస్థితుల్లో వేగాన్ని తగ్గించి జాగ్రత్తగా డ్రైవ్ చేయాలి. మన భద్రతతో పాటు ఇతర వాహనదారులు, పాదచారుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. సైబర్ నేరగాల గురించి మీకు ఎలాంటి ఫోన్ కాల్ వచ్చినా నాకు వెంటనే తెలియజేయాలని వారి బారిన పడ కుండా జాగ్రత్త పడాలని, వారు పంపుతున్న మెసేజ్ లను ఓపెన్ చేయవద్దని తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. వేగం కంటే ప్రాణం విలువైనది -- ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం, ప్రమాదాలను నివారిద్దాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డి టీ ఆర్ పి బృందం, పోలీస్ బృందం, స్థానిక పెద్దలు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# వినాయక నిమజ్జనంలో ఆరుగురు విద్యార్థులు మృతి

**నేరేడు చెరువులో మట్టి గుంతలు గుర్తించక నీటిలోకి దిగిన విద్యార్థులు**

**విషాద ఘటనతో పెద్దకంజర్లలో విషాదఛాయలు**











పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 16: వినాయక నిమజ్జనం కోసం చెరువులోకి దిగిన ఆరుగురు విద్యార్థులు నీటిలో మునిగి మృతి చెందిన విషాద ఘటన పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో చోటుచేసుకుంది. పెద్దకంజర్లలోని నేరేడు చెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు విద్యార్థులు నీటిలోకి దిగారు. చెరువులో మట్టి కోసం తీసిన గుంతలు ఉండటాన్ని గమనించకపోవడంతో లోతైన నీటిలోకి వెళ్లిన విద్యార్థులు ఈత రాక మునిగిపోయినట్లు సమాచారం. మృతులను నర్సింహరాజు, సుమంత్, గణేష్, ఉదయ్‌కిరణ్, శ్యామ్‌కుమార్, సిద్ధార్థ్‌గా గుర్తించారు. వీరిలో సుమంత్, గణేష్ డిప్లొమా రెండో సంవత్సరం, ఉదయ్‌కిరణ్ డిప్లొమా మూడో సంవత్సరం, శ్యామ్‌కుమార్ డిప్లొమా మొదటి సంవత్సరం, సిద్ధార్థ్ పదో తరగతి చదువుతున్నట్లు తెలిసింది. మృతులంతా శిరీష చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన విద్యార్థులుగా అధికారులు తెలిపారు. పటాన్‌చెరులోని ప్రావీన్ గ్లోబల్ ఆస్పత్రిలో మృతదేహాలను ఉంచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని మృతదేహాలకు నివాళులర్పించారు. తోటి విద్యార్థులను అడిగి ఘటన వివరాలను తెలుసుకున్నారు. పోస్టుమార్టం ప్రక్రియను గురువారం ఉదయం 10 గంటల్లోపు పూర్తి చేసి, అనంతరం మృతదేహాలను వారి స్వగ్రామాలకు అంబులెన్సుల్లో తరలించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం తన సొంత నిధులతో అంబులెన్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్ కూడా ఆస్పత్రికి చేరుకుని ఘటనపై వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రికి తరలించే అవకాశం ఉంది. శివనగర్ చౌరస్తా సమీపంలోని పెద్దకంజర్లలో శిరీష చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఆశ్రయం కల్పిస్తూ మొదటి తరగతి నుంచి పాలిటెక్నిక్, బీటెక్ వరకు సుమారు 70 మంది విద్యార్థులు అక్కడ విద్యాభ్యాసం చేస్తున్నట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కృష్ణంరాజు తన కుమార్తె శిరీష పేరు మీద ఈ ట్రస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

## అత్తాపూర్‌లో అర్ధరాత్రి పోకిరీల హల్‌చల్


**- మోడిఫైడ్ కార్లతో ర్యాష్ డ్రైవింగ్**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్‌మెంట్ డి-మార్ట్ చౌరస్తా వద్ద అర్ధరాత్రి కొందరు మైనర్ యువకులు మోడిఫైడ్ కార్లతో హల్‌చల్ చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా ఆందోళనకు దారితీశాయి. రహదారులపై వేగంగా కార్లు నడుపుతూ ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అర్ధరాత్రి సమయంలో రోడ్లపై స్టంట్లు, ప్రమాదకరంగా వాహనాలు నడపడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అకస్మాత్తుగా వేగం పెంచడం, రహదారిపై హంగామా చేయడం వంటి చర్యలతో ప్రమాదాల ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు దృష్టి సారించి రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లయితే వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. అర్ధరాత్రి వేళ రహదారులపై జరుగుతున్న ర్యాష్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు అత్తాపూర్ పోలీసులు, రాజేంద్రనగర్ డీసీపీ ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లోఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం పౌష్టికాహార పంపిణీకే పరిమితం కాకుండా, పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు తోడ్పడే ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్ళ సింగారం అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను చిన్న వయసులోనే స్కూళ్లకు పంపి మానసిక ఒత్తిడికి గురిచేయకుండా, అంగన్‌వాడీల్లో ఆటల ద్వారా అక్షరాలు, రంగులు, అంకెలను సులభంగా నేర్చుకుంటారని అన్నారు. ఈనాటి కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఇందిరా,రమణ, సునీత, యాదమ్మ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బాలాపూర్ గణనాధుని దర్శించుకున్న చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విషేశ్వర్ రెడ్డి, పూజా కార్యక్రమం అనంతరం ఉత్సవ సమితి కమిటీ అధ్యక్షులు నిరంజన్ రెడ్డి కొండ విశ్వేశ్వర్ రెడ్డి కి బాలాపూర్ గణనాథుడి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు (బాలాపూర్ క్రైమ్ మిర్రర్)

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కిరణ్ కుమార్ సంగం నియామకం

**గండిపేట, (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా కిరణ్ కుమార్ సంగం నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి బుధవారం కిరణ్ కుమార్ సంగంకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆకాంక్షించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మణికొండ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ఆశీస్సులతో ఈ కీలక బాధ్యత కిరణ్ కుమార్ సంగంకు దక్కింది. నియామకం అనంతరం ఆయన రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మణికొండ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన కిరణ్ కుమార్ సంగం మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు



అప్పగించిన చల్లా నర్సింహారెడ్డి, కస్తూరి నరేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నెక్నాంపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్, మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, మాజీ కో-ఆప్షన్ సభ్యులు తాజ్ భాయ్, మాజీ మైనారిటీ అధ్యక్షులు షేక్ హాజీ, సీనియర్ నాయకులు మహేష్ రెడ్డి, ప్రవీణ్, విఠల్ రెడ్డి, అఖిల్, రమేష్, ప్రవీణ్ సంగం, మారుతి, నరేందర్, కార్తిక్, మణికొండ మహిళా అధ్యక్షురాలు సావిత్రి తదితరులు పాల్గొని కిరణ్ కుమార్ సంగంకు అభినందనలు తెలిపారు.

## చలో కొడంగల్ పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేద్దాం

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రక్షణ సేన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్‌లో పాంచజన్య సంకల్ప సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి నీరుడు సర్వేష్ ముదిరాజ్, మహిళా నాయకురాలు భువనగిరి ఇంద్ర, పూజారి ప్రవీణ్ కురుమ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ఈ నెల 20న కొడంగల్ నియోజకవర్గం కోస్గి కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల సమస్యలను ప్రస్తావిస్తూ సామాజిక న్యాయం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామస్థాయి నుండి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సభకు భారీగా తరలిరావాలని కోరారు. పాంచజన్య సంకల్ప సభ ద్వారా కవిత భవిష్యత్ కార్యాచరణను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు.



ఈ కార్యక్రమంలో లక్ష్మి, రాజేష్ ముదిరాజ్, సాయి, తిమ్మప్ప, శ్రీను, సుశీల్, అఖిల్ కుమార్, రాము, బాలు, వెంకటేష్, హేమేంద్ర, వంశీ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా - కర్నాటి విద్యాసాగర్

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాంపల్లి మండలం పరిధిలోని సుంకిశాల గ్రామానికి చెందిన పాక నర్సమ్మ అనే 96 సంవత్సరాల వృద్ధురాలు ఇటీవల మరణిగా, స్థానిక మాజీ సర్పంచ్ బాషిపాక రామన్న ద్వారా విషయం తెలుసుకున్న బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కర్నాటి విద్యాసాగర్ చరవాని ద్వారా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, స్థానిక నాయకుల ద్వారా ఖర్చుల నిమిత్తం 10.000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాద లచ్చయ్య, నేరేడుగోమ్ము సత్యనారాయణ, ఎడమ మల్లేష్, బుడిగపాక లక్ష్మయ్య, కలకొండ వెంకటయ్య, నేతల దేవేందర్ ఎరుకల ఆంజనేయులు, బాలకృష్ణ, ఎరుకల వెంకటయ్య, మల్లయ్య, శ్రీకాంత్, భారతమ్మ, రాములు, తదితరులు పాల్గొన్నారు.






## పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయం హుండి లెక్కింపు

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి శ్రావణ మాస చిన్న జాతర ఉత్సవాలకు భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకల హుండిని దేవాలయ చైర్మన్ మైపాల్ రెడ్డి, కార్యనిర్వాహణాధికారి జి బాల నర్సయ్య ఆధ్వర్యంలో బుధవారం విప్పడం జరిగింది. ఇట్టి రూపాయలు 3,67,060/-మూడు లక్షల అరవై ఏడు వేల అరవై రూపాయలు వెలువడినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు ప్రణీత్ కుమార్, గ్రామ సర్పంచ్ శ్రీనయ్య, దేవాలయ అర్చకులు దశరథం, పాండు శర్మ, ఆలయ కమిటీ సభ్యులు సి. అంజిలయ్య,ఎం.ప్రభాకర్, కే. లక్ష్మి, చిన్న నరసింహులు, శ్రీ సాంబశివ సేవా సమితి సభ్యులు దేవాలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పైన కల్పిత నాయకుడు అని పుస్తకం రాస్తున్న అమరాప్రసాద్ ను వెంటనే అరెస్టు చెయ్యాలి



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పైన కల్పిత నాయకుడు అని పుస్తకం రాస్తున్న దేశద్రోహి అమర ప్రసాదు నువ్వు వెంటనే అరెస్టు చేయాలని అంబేద్కర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత పి ఆర్ టి యు పరిగి మండల శాఖ అధ్యక్షులు అంబేద్కర్ విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి మంచంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ దేశంలో అన్ని వర్గాల ప్రజలు కుల ,మత, ప్రాంతం అభిప్రాయ బేధాలు లేకుండా  భిన్నత్వంలో ఏకత్వం అనే విధంగా,ఈ భారత దేశంలో ప్రతీ సమస్యకు పరిష్కారం చూపిన ప్రపంచ మేధావి డాక్టర్ బాబా సాహెబ్ అంబెడ్కర్ అని, వారి పుట్టిన రోజును వరల్డ్ నాలెడ్జ్ డే గా ప్రపంచ దేశాలు,ఐక్యరాజ్య సమితి గుర్తిస్తే భారతదేశంలో మాత్రం హిందు మానువాదం పేరుతో గతంలో ఎన్నో దాడులు జరిగావని,కాని ఇప్పుడు దళిత హిందు సంఘం పేరుమీద దళితులతోటే అంబేడ్కర్ పైన దాడులు జరుగుతున్నవి.ఇట్టి విషయంలో నిజమైన దళిత సంఘాలు ఇట్టి దాడిని తిప్పికొట్టాలని,అదేవిధంగా అంబేద్కర్ ను దళిత ఓటు బ్యాంకుగా మార్చుకొని,ఎన్నో విధాలుగా రాజకీయ నాయకులు మాట్లాడుతూన్నారు. గతలో భారత ప్రధాని నరేంద్రమోడీ నేను ఈరోజు అంబేడ్కర్ రాసిన రాజ్యగం ఫలితంగానే నేను ఈ భారతదేశానికి ప్రధానినీ కగలిగాను అన్నారు.గతంలో ఇందిరాగాంధీ కూడా ఇదే విషయం చెప్పాన్నారు. లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈదేశం కేవలం అంబేద్కర్ రాసిన రాజ్యగం మాత్రమే ఈ దేశాన్ని కాపాడుతుందని, రాజ్యాంగాన్ని పట్టుకొని దేశం మొత్తం తిరుగుతున్నారు.గతంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి నిండు అసెంబ్లీలో చిన్న రాష్ట్రాల స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్  రాజ్యగంలో ఆర్టికల్ మూడు  పొందు పరిచినందుకే మనకు తెలంగాణ రాష్ట్రమును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడం జరిగిందని చెప్పడం జరిగింది. ఈ మూడు సందర్భలలో మనకు అంబేద్కర్ రాజ్యగం విలువలు అర్ధమౌతుంది.అదేవిధంగా అంబేద్కర్ ఈ భారత దేశంలో 1919 న పుట్టి ఎన్నో ఉన్నతమైన చదువులు,ఎన్నో రచనలు,ఎన్నో పోరాటాలు చేసిన నాయకులనని ,మహాద్ చెరువు,కుల నిర్మూలన,యౌవలాన్ సదస్సులో ప్రసంగం,ఈ రోజు ఆర్థిక వ్యవస్థ కు రూపం తెచ్చిన గ్రంథం థీ ప్రాబ్లమ్ ఆఫ్ రూపి, వివిధ సంఘాలు,పార్టీలు స్థాపించి ఎన్నికల్లో పోటీ చేసిన నాయకులు,రాజ్యగ ముసాయిదా కమిటీ ఛైర్మన్,పార్లమెంట్ లో అతని ప్రసంగాలు ఎన్నో ఉన్నవి చివరకు 1956 న భారతదేశానికి ప్రాణాలు అర్పించడం జరిగింది అన్నారు.కానీ ఒక్క దొంగ దళిత హిందు సంఘం ముసుగులో అమరప్రసాద్ అనే వ్యక్తి ఇంత చేసిన అంబేద్కర్ ని కల్పిత నాయకులు అంబేద్కర్ అని ఒక్క పుస్తకం రాయడం ఇట్టి విషయంలో దళిత మంత్రులు, ఎమ్మెల్యే,ఏమ్మెల్సీ, దళిత ఐఏఎస్,ఐపీఎస్, ఉద్యోగుల,ఉన్నత అధికారులు అమర ప్రసాద్ కు వ్యతిరేకంగా పోరాటం చెయ్యాలి ,పైన చెప్పిన మూడు ప్రధాన పార్టీలు స్పందించకపోవడాన్ని అంబేద్కర్ విజ్ఞాన వేదిక తరుపున తీవ్రంగా కండిస్తున్నామని అన్నారు. అమర ప్రసాద్ వెనుక ఎవ్వరో కల్పిత నాయకులు ఉన్నారో,త్వరలోనే తెలుస్తుంది. ఎందుకంటే ఇంత వరకు ఒక్క పుస్తకం రాయని అమర ప్రసాద్,అంబేద్కర్ గారిపైన కల్పిత నాయకులు అని రాస్తున్నారు అంటేనే అతడికి తెలివిలేదు కల్పితం అంటే కథలు చదివు లేనివారికి ఊహించి రాయడం,కానీ మనకు ఎన్నో సాక్షాలుగా అంబేద్కర్ జీవిత చరిత్ర ఉంది,ప్రసంగాలు ఉన్నవి కల్పితం ఎట్లా అవుతుంది.ఈ రోజు మానువాద భావజాలం ఉన్న సంఘాలు అంబేద్కర్ ని తక్కువగా చూపి తరువాత రాజ్యగంన్ని రద్దు చెయ్యాలని చూస్తున్నవి కావున వివిధ పార్టీలలో ఉన్న దళిత మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ,మాజీ ఎమ్మెల్యే,మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలసి వెంటనే అమర ప్రసాద్ ను  అరెస్ట్ చెయ్యాలి,కల్పిత నాయకులు పుస్తకాన్ని పూర్తిగా రద్దు చెయ్యాలని అని మెమోరాండం ఇవ్వాలి.అదేవిధంగా టి.ఆర్,ఎస్ పార్టీ లోని  నాయకులు మీ పార్టీ అధ్యక్షులు,బీజేపీ పార్టీ నాయకులు మీ పార్టీ అధ్యక్షులు తో మాట్లాడి అమర ప్రసాద్ పైన పోరాటమా??లేక సమర్ధతన?? అనే విషయాన్ని తెలియజేయండి.ఈ నేల 18 న కల్పిత నాయకులు అంబేద్కర్ గారి పైన పుస్తకం  ఆవిష్కరణనను రాజ్యగ బద్దంగా ఆపాలి .లేని పక్షంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దళిత,బడుగు బలహీన వర్గాల నాయకులతో కలిసి ,అదేవిధంగా ఎస్సి,ఎస్టీ,బీసీ,మైనారిటీ,వివిధ విద్యార్థి సంఘాలతో ప్రెస్ క్లబ్ ను ముట్టిండిస్తామని ,తరువాత జరిగే పరిణామాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు.

# మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో వినాయక మండపాల పూజా, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రేమ్ గౌడ్



**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్, కాటేదాన్, దుర్గానగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను ప్రేమ్ గౌడ్ సందర్శించి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేమ్ గౌడ్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మండపాల వద్ద భక్తులకు పూజా ఏర్పాట్లు, ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ధనుంజయ, కాశి గారి యాదగిరి నేత, కళ్లెం లక్ష్మారెడ్డి, బాస శ్రీనివాస్ నేత, పులిజాల వివేకానంద నేత, అర్థం లక్ష్మయ్య గుప్తా, శేఖర్ నేత, గట్టయ్య, సంజీవ్, యాదయ్య, బండారి యాదగిరి నేత, ఆంజనేయులు, యంజాల శేఖర్ నేత, విజయ్, పార్టీ కార్యకర్తలు, స్థానిక బస్తీవాసులు విశేషంగా పాల్గొన్నారు.





## కూల్చివేతలే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా: పువ్వాడ

### శ్రీనివాస్ నగర్ బాధితులకు మాజీ మంత్రి పువ్వాడ మద్దతు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వానికి విధ్వంసం, కూల్చివేతలు తప్ప మరో ఎజెండా కనిపించడం లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులకు ఆయన మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కోసం కొత్తగా నిర్మించిన ఇళ్ల కంటే, వివిధ కారణాలతో కూల్చివేసిన ఇళ్లే ఎక్కువగా ఉన్నాయని పువ్వాడ ఆందోళన వ్యక్తం చేశారు. వికాసం, అభివృద్ధి చేపట్టడం చేతకాని ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడుతోందని మండిపడ్డారు. పేదల ఇళ్లను కూల్చివేసి వారి జీవనోపాధిపై ప్రభావం చూపడం సరికాదని, పేదల పొట్ట కొట్టే చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇళ్ల కూల్చివేత ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం నగరంలో అనేక మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించడంతో పాటు, పేదలకు గృహ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టామని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేశారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి నిదర్శనమైతే, ఇప్పుడు పేదల ఇళ్లు కూల్చివేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మిగిలిన ఘనతగా మారిందని ఆయన విమర్శించారు.

## ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో పరిగి శాసనసభ్యులు, టీపీసీసీ సర్ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ టి రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు శివుని బాబమ్మ బాబయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని ఇచ్చి ముగ్గు వేశారు.కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మాకు ఇల్లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో కుల్కచర్ల సొసైటీ చైర్మన్ బొలుసని భీంరెడ్డి, ఇందిరమ్మ కమిటీ కన్వీనర్ సుంకిరెడ్డి కృష్ణారెడ్డి,మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, వార్డు సభ్యులు కర్రె వినోద్ కుమార్, మిద్దె భీమయ్య, ఐలగారి కృష్ణయ్య, నరహరి, ముకుందం, ఎల్లయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు...